గణపతి ఉత్సవాలు షురూ

● కొలువుదీరనున్న భారీ విగ్రహాలు

సదాశివపేట(సంగారెడ్డి): జైబోలో గణేష్ మహరాజ్ కి.. జై అని అనే సమయం రానేవచ్చింది. 7న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 8 మున్సిపాలిటీలు, 647 పంచాయతీల పరిధిలో వినాయక చవితి శోభ సంతరించుకుంది. కుల మతాలకతీతంగా చిన్నా, పెద్ద తెడా లేకుండా అందరూ కలిసి సంతోషంగా వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు వందల సంఖ్యలో మండపాలు సిద్ధమయ్యాయి. జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణ


ముస్తాబైన వినాయక మండపం

ఖేడ్, జోగిపేట, పటన్‌చేరు, ఇస్నాపూర్, అమిన్‌పూర్, రామచంద్రాపూర్, బోంతపల్లి,బోల్లారం, తెల్లాపూర్ పట్టణాలతో పాటు జిల్లాలోని మెజర్ గ్రామ పంచాయతీలతోపాటు గ్రామ పంచాయతీల్లో వందల సంఖ్యలో వినాయక మండపాలను ఏర్పాటు చేసి భారి నుంచి అతిభారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులపైను కాకుండా వీధి కూడళ్లు, సందు గొందుల్లో కూడ చవితి మండపాలను ఏర్పాటు చేశారు.ఈ సారి పండుగ చాలా సందడిగా జరిగే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండడంతో పెద్ద పెద్ద విగ్రహాల ప్రతిష్టాపన జిల్లా అంతట ఉంది, మండపాలను ఏర్పాటు చేయడంలో నిర్వహకులు మునిగిపోయారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం


చెక్కులు చూపిస్తున్న వెన్నవరం భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెలంగాణ, ఏపీ వరద బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర మాజీ శాసనమండలి ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీలో వరద దృశ్యాలు చూసి చలించిపోయానన్నారు. అందులో భాగంగా తెలంగాణకు రూ. లక్ష, ఏపీకి రూ. లక్ష విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణకు చెందిన చెక్కును కలెక్టర్‌కు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆదర్శ్‌రెడ్డి, కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణకాంత్, అజముద్దీన్, గౌస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): వరద బాధితుల ఆదుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్ అన్నారు. పట్టణంలోని శ్రీ సత్యసాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వరద బాధితుల కోసం విరాళాలను సేకరించి శనివారం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.22 వేలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, నల్ల జయమ్మ, తబస్సుమ్ పాల్గొన్నారు.

◆ పత్తి రైతుల ఆందోళన

మునిపల్లి(అందోల్): వర్షాల దెబ్బకు పత్తి పంట ఎక్కడికక్కడ నేలకొరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే భారీ వర్షం కురుస్తోంది. దీంతో పైరు నేలకొరుగుతుందని, వారం రోజుల నుంచి కురుస్తున్న వానల వల్ల పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం లేకపోలేదని రైతులు వాపోయారు.

◆ కూలిన స్తంభం.. తప్పిన ప్రమాదం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో అల్గోల్ సర్కిల్ వద్ద శుక్రవారం సోలార్ స్తంభం కూలింది. ఆ సమయంలో సంఘటన స్థలంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బైపాస్ రోడ్డు అల్గోల్ చౌరస్తా వద్ద రహదారికి ఇరువైపుల పెద్ద సంఖ్యలో సొలార్ స్తంభాలను ఏర్పాటు చేశారు.ఈ ప్రాంతంలో నిత్యం రద్దీ ఉంటుంది. మూల మలుపు వద్ద గల స్తంభం ఒక్కసారిగా కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరు కూడా లేరు. దీంతో ప్రమాదం తప్పింది.

◆ ఘనంగా బసవ పురాణం సమాప్తి ఉత్సవం

కంగ్టి(నారాయణఖేడ్): నెల రోజులుగా శ్రావణ మాసం పురస్కరించుకొని మండలంలోని చాప్టా(కే) గ్రామంలో నిర్వహించిన బసవపురాణం పారాయణ సమాప్తి ఉత్సవం శుక్రవారం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కౌలాస్‌లోని మహంతేశ్వర మఠం పీఠాధీశ్వరుడు మల్లికార్జున శివాచార్యులు నెల రోజులుగా బసవపురాణం పారాయణం చేశారు. మహిళలు కలశాలు తలపై ఉంచుకొని ఊరేగింపుగా గ్రామ దేవతలకు ప్రదక్షిణలు చేశారు.

◆ రోడ్డుపై విరిగిపడ్డ భారీ వృక్షం

నారాయణఖేడ్: నిజాంపేట- ఖేడ్- బీదర్ 161బీ జాతీయ రహదారిపై నిజాంపేట మండలం ర్యాల మడుగు సమీపంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్డుపక్కన ఉన్న ఓ భారీ చెట్టు విరిగి రోడ్డపై పడింది. ఆ సమయంలో ఖేడ్ వైపు వస్తున్న ఖేడ్ ఆర్టీసీ బస్సుపై కొమ్మలు బస్సుపై పడ్డాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ



సదాశివపేట(సంగారెడ్డి): మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


నారాయణఖేడ్ మట్టి గణపతిని అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


పటాన్‌చెరు: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


జహీరాబాద్: మట్టి వినాయక విగ్రహాలను దర్శించుకుంటున్న విద్యార్థులు

కోహీర్ ఎస్ఐగా భూపతి

జహీరాబాద్: కోహీర్ ఎస్ఐగా భూపతి సతీష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ నుంచి బదిలీపై కోహీర్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. కోహీర్‌లో విధులు నిర్వహించిన అరుణ్‌కుమార్ వికారాబాద్ జిల్లా నవాబుపేటకు బదిలీపై వెళ్లారు.

శాంతియుతంగా పండగలు జరుపుకోవాలి

కంగ్టి(నారాయణఖేడ్): వినాయకచవితి, మిలాద్ ఉల్ నబీ, నిమజ్జనోత్సవాలు శాంతి, సామరస్యాలతో జరుపుకోవాలని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని తడ్కల్ గ్రామానికి చెందిన ముస్లింలకు శుక్రవారం కంగ్టి పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. డాక్టర్ హమీద్, సత్తార్ సాబ్, సుమేర్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

కంగ్టి(నారాయణఖేడ్): ఆకస్మికంగా ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి వంట గదిలో కూరగాయలు, వంటదినుసుల నాణ్యతను శుక్రవారం ఎంపీడీఓ సత్తయ్య పరిశీలించారు. మండలంలోని తడ్కల్‌లో సాంఘీక సంక్షేమ ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల హాజరు, పుస్తకాల పంపిణీ రిజిష్టర్‌తో పాటు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి లభ్యత, మరుగుదొడ్ల పరిశుభ్రత పరిశీలించి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామప్పకు సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోషకాహార వారోత్సవాలు

కల్హేర్(నారాయణఖేడ్): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల సూచించారు. శుక్రవారం కల్హేర్‌లో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, ప్రభవాతి, స్వప్న, సునీత పాల్గొన్నారు.

తాగిన మత్తులో డయల్ 100కు ఫోన్

కల్హేర్(నారాయణఖేడ్): తాగిన మత్తులో ఓ వ్యక్తి ఏకంగా 14 సార్లు 100 నంబర్‌కు ఫోన్ చేసిన సంఘటన సిర్గాపూర్ మండలంలోని పోచాపూర్‌లో శుక్రవారం జరిగింది. పోచాపూర్ గ్రామనికి చెందిన దూదెకుల నయీం తాగిన మైకంలో తన తల్లి భూమి ఇస్తాలేదని రోజు డయల్ 100కు ఫోన్ చేయడం మొదలు పెట్టాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

పిడుగు పాటుతో ఎద్దు మృతి

కల్హేర్(నారాయణఖేడ్): పిడుగు పడడంతో ఎద్దు మృతి చెందింది. శుక్రవారం సిర్గాపూర్ మండలం ఉజలంపాడు శివారులో సంఘటన జరిగింది. గ్రామనికి చెందిన రైతు నెహ్రూనాయక్‌కు సంబంధించిన ఎద్దు పంట చేలలో మేపుతుండగా పిడుగు పడింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: వివిధ ఆస్పత్రుల్లో వైద్యం పొందిన వారికి ప్రభుత్వ పరంగా సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అందజేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని చిరాగ్‌పల్లికి చెందిన పర్వీన్‌కు రూ.39వేలు, ఝరాసంగం మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన ముస్తఫాకు రూ.46,500, ఎల్గోయి గ్రామానికి చెందిన 34వేలు, పొట్‌పల్లి గ్రామానికి చెందిన నర్సింహులుకు రూ.14,500, ఝరాసంగంకు చెందిన బసప్పకు రూ.60వేలు విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు నారాయణ, మోహన్‌రెడ్డి, వెంకటేశం, ఎజాజ్, నాగన్న, సిద్ధన్నపటేల్, బాబూమియా, సంగారెడ్డి పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం

పటాన్‌చెరు టౌన్: మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుదాం అని ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాదిరి పృథ్వీరాజ్ అన్నారు. డివిజన్ పరిధిలోని మార్కెట్‌యార్డ్‌లో శుక్రవారం ఉదయం మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. ఆరేళ్లుగా ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నాం అని తెలిపారు. కార్యక్రమంలో కిష్టయ్య, మాజీ వార్డు మెంబర్ ఆనంతయ్య, సంతోష్, వాసు, ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.


మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు

ఉపాధి హామీ నిర్వీర్యం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొట్టాలని భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి తాజొద్దీన్ పిలుపునిచ్చారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు, అనంతరం డీఆర్ఓ రజనికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాజొద్దీన్ మాట్లాడుతూ ఎప్పుడైతే కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టిందో అప్పటి నుంచి జాతీయ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రతి సంవత్సరం ఉపాది హామీకి కేటాయించే బడ్జెట్‌ను తగ్గిస్తుందని ఆరోపించారు. రైతు, కార్మిక సంఘాలు ఏకమై కేంద్రం చేసే కుట్రలను తిప్పికొట్టలని పిలుపునిచ్చారు. సదాశివపేటలో పూరి గుడిసెలు వేసుకుని ఉన్న వారికి పట్టాలు పంపిణీ చేయలని అదేవిధంగా 50 సంవత్సరాలు నిండిన ఉపాధి కూలీకి నెలకు రూ 5000 పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేయూ జిల్లా అధ్యక్షురాలు వినోద, నాయకులు ముస్తఫా, పాండు, యాకూబ్ అలీ, చిరంజీవి, మహబూబ్ అలీ, పాషా, పూలమ్మ, శంకరమ్మ, లక్ష్మి, అనసూజ పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి


కంగ్టి: మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి డ్రైడేపై అవగాహన కల్పించిన అధికారులు

● మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని శుక్రవారం వీధుల్లో తిరిగి ప్రజలకు మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్ అవగాహన కల్పించారు. మండల కేంద్రం కంగ్టిలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీరాజ్ అధికారులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి, పారిశుద్ధ్యం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, ఏంపీఓ సుభాష్,హెల్త్ సూపర్‌వైజర్ కమల తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఉద్యమం

పటాన్‌చెరు టౌన్: కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... యూనియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలంతా కాంట్రాక్టు, క్యాజువల్ ఫిక్స్‌డ్ అన్నిరకాల కార్మికుల సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు. కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, యూనిఫాం, సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మల్లేష్, కె.రాజ య్య, పాండురంగారెడ్డి, శాంతకుమార్, రామకృష్ణ, సంతోష్, చక్రధర్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సదాశివపేట(సంగారెడ్డి): ప్రైవేట్ పరిశ్రమల్లో కాంట్రాక్టు క్యాజువల్ కార్మికులకు ఉద్యోగ భద్ర త కలిపించడం తోపాటు పర్మినెంట్ చేసి చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి. ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నీలం మల్లేశం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల పొజిషన్ చూపండి


వినతిపత్రం అందజేస్తున్న మార్డి గ్రామస్తులు

నారాయణఖేడ్: కల్హేర్ మండలం మార్డిలోని సర్వేసంఖ్య 10లో ఇళ్లు లేని 74 ఎస్సీలకు 1999లో అప్ప టి ఎమ్మెల్యే కిష్టారెడ్డి ఎస్సీ మోడల్ కాలనీ కోసం ఇళ్ల పట్టాలు అందజేశారు. కానీ ఇప్పటివరకు పొజిషన్ చూపనందున పొజిషన్ చూపాలని కోరుతూ బాధితులు శుక్రవారం ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇళ్ల లేక తాము తీ వ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తమకు న్యాయం చేయాలని కోరారు. మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ పట్టణానికి చెందిన నిజాముద్దీన్, పంచగామకు చెందిన సాయిలుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ పోషకాహార వారోత్సవాలు

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా, పెద్ద చల్మెడ, ఖమ్మంపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో కార్యకర్తలు పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. శుక్రవారం ఆయా గ్రామాల సెంటర్‌లలో నిర్వహించిన కార్యక్రమాలను సూపర్ వైజర్ నాగమణి పర్యవేక్షించారు. చిన్నారులకు, తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రేణుక, శాంతమ్మ, లక్ష్మి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ రైతులను ఆదుకోవాలి

వట్‌పల్లి(అందోల్): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వట్‌పల్లి మండలంలో పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయాధికారులు నష్టంపై నివేదిక తయారు చేయాలని సీపీఎం అందోల్ డివిజన్ కన్వీనర్ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మండల ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. నష్టంపై అంచనా తయారు చేయాలన్నారు. ఆ వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. గ్రామాల్లో వర్షం వల్ల కూలిన ఇళ్ల బాధితులకు కొత్తవి మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ వర్షంతో పత్తికి తెగులు

వట్‌పల్లి(అందోల్): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు తెగులు సోకి వాడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వట్‌పల్లి మండలంలో ఎక్కువ మొత్తంలో రైతులు పత్తి సాగు చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షంతో పంట దెబ్బతిని ఎండుముఖం పట్టింది. దీంతో పంట పూత కూడా రాలి ఎర్రబారుతోంది. మండల కేంద్రమైన వట్‌పల్లికి చెందిన రైతు రామాగౌడ్ పత్తి పంట సాగు చేయగా అర ఎకరం పైగా పత్తి వాడిపోవడాన్ని చూసి లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

◆ రోగులకు మెరుగైన వైద్య సేవలు

రాయికోడ్(అందోల్): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్‌తో కలిసి మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అక్కడికి విచ్చేసిన పలువురితో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.అంజయ్య, టీచర్లు, పంచాయతీ కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

◆ ముస్తాబైన రామలింగేశ్వర ఆలయం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని రామలింగేశ్వర దేవస్థానంలో 48వ వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం ముస్తాబైంది. ఈనెల 7వ తేదీ నుంచి 11 వరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

◆ సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌ను శుక్రవారం పాఠశాలలో కాంగ్రెస్ నాయకులు శివశంకర్, మధుసూదన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

◆ సద్వినియోగం చేసుకోవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ లింగమణి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రేజింతల్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

◆ బైరు మల్లయ్య స్ఫూర్తితో ఉద్యమిద్దాం

సంగారెడ్డి రూరల్: కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాటం చేద్దామని కల్లుగీతా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ అన్నారు. బైరు మల్లయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సంఘ భవనంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను చింతా ప్రభాకర్ అందజేశారు. నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ.16,98,500 విలువ చేసే చెక్కులు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

◆ ఉచితంగా పంపిణీ

సంగారెడ్డి రూరల్: వాసవి మా ఇళ్ళు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద 5116 మట్టి గణపతులను మహేశ్వర సిద్ధాంతి చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు తోపేజీ అనంతకిషన్, రాధాకిషన్, ప్రకాష్, దయాకర్ పాల్గొన్నారు.

◆ అవగాహన

హత్నూర(సంగారెడ్డి): మండలం సిరిపురం గ్రామంలో ఆధునిక వ్యవసాయంపై రైతులకు శుక్రవారం సుజికి ఇన్నోవేషన్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు ఎప్పటికప్పుడు ఆధునిక పద్ధతితో వ్యవసాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ సంస్థ ప్రతినిధి రమాదేవి అన్నారు. అనంతరం సంస్థ ద్వారా నిర్మించిన పాఠశాల భవనాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

◆ ఖానాపూర్(కె)లో డ్రైడే

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ గ్రామ పరిసరాలు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతి సెక్రటరి పవన్ పాల్గొన్నారు.

◆ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు మన్సూర్‌పూర్‌లో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు కాలనీలతోపాటు ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

◆ కలెక్టర్‌కు మట్టి గణపతి అందజేత

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వినాయక చవితి పండుగ సందర్భంగా కలెక్టర్ క్రాంతికి నాగ్సాన్ పల్లి గ్రామానికి చెందిన యువజన నాయకుడు గణేష్ మట్టి గణపతి ప్రతిమను అందజేశారు. మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ సూచించారని ఆయన పేర్కొన్నారు. మామిళ్ల ఆనంద్ పాల్గొన్నారు.

◆ భక్తిశ్రద్ధలతో హోమం

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి మేఘ్యానాయక్ తండాలోని భవానీ మాత ఆలయం ఆవరణలో శుక్రవారం హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్రలోని పొరాదేవిలోని రాంరావ్‌మహారాజ్ ఆశ్రమం నుంచి శేఖర్ మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

క్లుప్తంగా

కూలిన ఆబ్కారీ ప్రహరీ గోడ


కూలిన ఆబ్కారీ కార్యాలయం ప్రహరీ గోడ

సంగారెడ్డి క్రైమ్: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి సంగారెడ్డిలోని ఆబ్కారీ శాఖ కార్యాలయం ప్రధాన ద్వారం ప్రహరీగోడ కూలిపోయింది. అయితే.. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ గోడల పరిస్థితి ఇలాగే ఉంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్తపడేస్తే జరిమానా

మున్సిపల్ కమిషనర్ చౌహాన్


జరిమాన విధిస్తున్న కమిషనర్ ప్రసాద్ చౌహాన్

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి మున్సిపాలిటీలోని పలు కాలనీలను మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సందర్శించారు. సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శాంతినగర్‌లో రోడ్డుపై ఉన్న చెత్తాచెదారం చూసి కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు, చెత్తవేసిన వ్యక్తికి రూ.3,000 జరిమానా విధించారు. చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేస్తే సహించమని హెచ్చరించారు. ఇకముందు ఎవరైనా చెత్త వేస్తే రూ.వెయ్యి నుంచి రూ.10 వే వరకు జరిమానా ఉంటుందని చెప్పారు.

పంట నష్టం పరిశీలన


పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఏఓ లావణ్య

జహీరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ ఏఓ లావణ్య పరిశీలించారు. శుక్రవారం మండలంలోని గోవింద్‌పూర్ గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న పంట పొలాలను పరిశీలించారు. కంది, పత్తి, సోయాబీన్, మినుము, పెసర పంటల పరిస్థితిని చూశారు. ఈ మేరకు పంటలు దెబ్బతిన్నాయనేది స్వయంగా పరిశీలించి, రైతులతో సమావేశం అయ్యారు.

పరిశ్రమ ఎదుట కార్మికుల ఆందోళన


పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం గుండ్ల మాచునూర్ గ్రామ శివారులో ఎపిటోరియా యూనిట్ మూడు పరిశ్రమ ఎదుట శుక్రవారం కార్మికులు బైఠాయించారు. పండగల సమయంలో కార్మికులను విధుల్లోకి తీసుకుంటే వేతనాలు ఇవ్వాల్సి వస్తుందని యాజమాన్యం నిరాకరిస్తుందని, అయితే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలుమార్లు ఈ విషయమే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా మొండి వైఖరి వీడడం లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

రెండు క్లినిక్‌లకు జరిమానా, సీజ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రైవేట్ క్లినిక్‌లను పీఓఎంసీహెచ్ నాగనిర్మల శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపోలో డయాగ్నొస్టిక్ అనుమతి లేకుండా నిర్వహిస్తున్నందుకు, అదేవిధంగా ట్రైడెంట్ డెంటల్ క్లినిక్‌ను పర్మిషన్ తీసుకోకుండా ఇంద్రేశం నుంచి పటాన్‌చెరుకు మార్చినందున రూ.ఐదు వేల చొప్పున జరిమానా తోపాటు వాటిని సీజ్ చేశారు. జరిమానా చెల్లించి, అనుమతికి దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

పెసర్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పెసర్ల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. నాఫెడ్ వారి మార్కెఫెడ్ ఆధ్వర్యంలో ఇప్పెపల్లి సొసైటీ వారు పెసర్లు కొంటారు. ప్రభుత్వం రూ.8,682 మద్దతు ధర నిర్ణయించింది. తేమ 12 శాతం, ఇతర వ్యర్థాలు రెండు శాతం, దెబ్బతిన్న గింజలు రెండు శాతం వర్షానికి దెబ్బతిని రంగు మారిన గింజలు మూడు శాతం పుచ్చిపోయినవి రెండు శాతం పంట నాణ్యత కల్గిఉండాలని సొసైటీ చైర్మన్ మచ్చేందర్ తెలిపారు. పంటను అమ్ముకోవాలనకున్న రైతులు కొనుగోలు కేంద్రంలో పేరు నమెదు చేసుకొవాలన్నారు.